

# చంద్రహారం

హంగులన్నీ సింగారించుకున్న "భవాని కంటి ఆసుపత్రి"లో రోగులు బారులు దీరి కూర్చున్నారు. అద్దాల్లాంటి పాలిష్ బండలు, ఆయిల్‌పెయింట్స్ గోడలు, కదిలే మల్లెపూవుల్లా నర్సులు... శుచీ శుభ్రతకు మారుపేరులాగుంది. మోడ్రన్ డ్రెస్సులో హంసలా అడుగువేస్తూ వచ్చింది రిసెప్షనిస్టు. ముందు వరుసలో కూచున్న పాతిక మంది పేషెంట్స్‌కు చిరునవ్వుతోపాటు టోకెన్స్ అందించింది. ఆ నవ్వులో "పేషెన్స్‌తో కూచున్నారు గదా !" అనే అర్థముంది.

"మిగతా వాళ్లు వెళ్ళి పోవచ్చు" అంది తియ్యగా.

"మళ్లీ మధ్యాహ్నం రావాలా ?" అడిగారొకరు.

"మధ్యాహ్నమంతా డాక్టర్ గారికి ఆపరేషన్స్ తోనే సరిపోతుంది. రేపు ఉదయమే రండి."

కంటి రోగులందరికీ చెవులకింపుగా ఉన్నాయా మాటలు.

టోకెన్స్ అందుకున్న వారు కళ్ళు తడుముకుంటూ పళ్ళు బిగపట్టి తమలో తామే నవ్వుకుంటున్నారు. అందనివారు "రేపు మరింత ముందుగా రావాలి" అనుకుంటూ నిట్టూర్పులతో వెళ్తున్నారు. వందల సంఖ్యలో ఉన్న రోగులు పది నిమిషాల్లో పదులయ్యారు.

ఎలాంటి కంటి రోగాన్నైనా ఇట్టే కనిపెట్టి చికిత్స చేయడంలో డాక్టర్ భవానికి ఆ ప్రాంతంలో పోటీ లేదు. ఆమెకామే సాటి అంటారు. రోగులు ఒక్కొక్కరే డాక్టర్ గదిలో కొస్తున్నారు. ఎర్రని పెదాల మీద చిరు నవ్వులు చిందిస్తూ, ఆప్యాయంగా పలుకరిస్తూ, ప్రశ్నిస్తూ పరీక్షలు చేస్తోంది డాక్టర్ భవాని.

అప్పటికే చాలా మంది చూపించుకున్నారు. తదుపరి పేషంట్ మహిళ ... అందంగా ఉంది. ఒక పక్క యువతి, మరోపక్క యువకుడు చేతులు పట్టుకుని లోపలికి తీసుకొచ్చారు. యువతి, యువకులు డాక్టర్నే చూస్తున్నారు.

కారు మేఘల్లాంటి వెంట్రుకలు, మెరుపులాంటి ముఖము, నుదుట కుంకుమబొట్టు, చెవులకు మకరకుందనాలు... పేషెంట్‌ను చూడగానే డాక్టర్ కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా టపటపలాడినై. పేషంట్‌ను కుర్చీలో కూచోబెట్టి పరీక్షలు చేస్తోంది. చూపులు పేషెంట్ గుండెల మీద నిలబడిపోయినై.

ఓఫ్... చంద్రహారాలు ! మూడు వరుసల చంద్రహారం. కళ్ళు మిరుమిట్లు గొలిపే మేలిమి బంగారు నగ. మూడు వరుసల కొసల్ని రెండు వైపులా ముడేసుకున్న ముప్పన్నెల రాళ్ళబిళ్ళ ... ఎంత బాగుందో !

చంద్రహారమంటే తనకెంత మక్కువో ! అలాంటి నగ కొనుక్కోవాలని ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నా... ప్చ్... దేనికైనా సమయం రావాలి.

'మా అమ్మకు కళ్ళు కనబడ్డం లేదట డాక్టర్ !' యువకుడన్నాడు మర్యాదగా. కత్తెర మీసాలు ఒద్దికగా కదులుతున్నై.

"మూడేళ్ళ క్రితం మా మావయ్య చనిపోయారు. అప్పట్నుంచి ఏడ్చి ఏడ్చి మా అత్తయ్య కళ్ళు ఇట్లా ఐపోయినై డాక్టర్" యువతి వివరణ.

తదేకంగా చూసింది డాక్టర్.

"భూమి జాగలు, బాగా ఆస్తులున్నోళ్లు ఊర్లల్ల ఉండే బదులు ఉరేసుకుని చచ్చిందే నయం డాక్టరమ్మా, నా భర్తను నడిబజార్ల నరికేసింద్రమ్మా ..." గొల్లుమంది పేషంట్.

కొడుక్కు... ఒంటి మీద గొంగళి పురుగు పాకినట్టైంది.

'అబ్బా ! ఆ విషయాలు డాక్టర్ కెందుకమ్మా !

"ఆపరేషన్ చేసినా సరే. మా అత్తయ్యకు చూపు తెప్పించండి డాక్టర్" కోడలు బతిమాలింది. వసంతా గమనంలో ప్రకృతి లాగ ఆమె అవయవ సంపద నిండుగా ఉంది.

"సర్సరే ... !" మళ్ళీ పరీక్షలు ప్రారంభించింది డాక్టర్. ఇటు పరీక్షలు చేస్తుంటే అటు... మలిగిపోయానుకున్న చిన్ననాటి సంఘటనలు గుండె తెరమీది కొస్తున్నై. "జ్ఞాపకాల వ్యాపకాల్లో పేషెంట్ కన్యాయం చెయ్యొద్దు సుమా !" మనసు హెచ్చరించింది.

పేషంట్ ఊపిరి పీల్చినప్పుడల్లా వక్షస్థలం ఉబికి అణిగి పోతుంది. ఆ కదలికల్లో చంద్రహారం మెరుపు చూడముచ్చటగా ఉంది. పరీక్షలు ముగించి "ఆపరేషన్ చేస్తే తప్పకుండా చూపు వస్తుంది" అంది చేతులు కడుక్కుంటూ. ముడుచుకు పోయిన ముగ్గురి మొహాల మీద వెలుగు రేఖలు వికసించినై.

"ధ్యాంక్స్ డాక్టర్ ... ఆపరేషనెప్పుడు చేస్తారు ! ఎంత ఖర్చవుతుంది?" ఆసక్తిగా అడిగాడు కొడుకు.

ఖర్చు సంగతి ముందు చెప్పి "రేపు చేస్తా"నంది.

"సాయంత్రం డబ్బు తెచ్చి కట్టేస్తా డాక్టర్"

"సరే ... పేషంట్ పేరు సులోచన గదూ !"

"అవును డాక్టర్... మీ కెట్లా తెలుసు ?" కోడలు చూపులు గంభీరమై పోయినై. కొడుకు అవాక్కయాడు.

ఓ చిరునవ్వు సమాధానమైంది.

సులోచన ఏదో అడగాలనుకుంది. కాని అవకాశం లేదు.

డాక్టర్ భవాని పేషెంట్సును చూసొచ్చింది. భోంచేసి నడుం వాల్చేసరికి మధ్యాహ్నం రెండైంది. నాల్గు గంటలకు ఠంఛన్‌గా ఆపరేషన్ థియేటర్లో ఉండాలి.

ఆవిడ... ఆ సులోచన ... ఆనాటి దొర్సానే కదూ ! కాల చక్ర భ్రమణం ముప్పయ్యేళ్ళు వెనక్కు మళ్లింది...

ఆనాడు తాను కల్లాకపటం తెలియని పల్లెటూరు పిల్ల. హాయిగా ఆటలాడుకునే వయసు. తల్లి బూదవ్వ గడీలో దొర్సాని కనుసన్నల్లో పంజేసేది. తండ్రి యాదయ్య దొరగారి అడుగులకు మడుగులొత్తుతూ తన రక్తాన్ని చెమటగా మార్చి వాళ్ళ పొలాలను తడిపేవాడు. తల్లి లోపలి ఇంట్లో ... తండ్రి పశువుల కొట్టంలో ... వాళ్ళెప్పుడు కలుసుకునేవారో ... ఎంత సేపు కలుసుండేవారో .. ఏం మాట్లాడుకునేవారో !

మూడు వరుసల చంద్రహారం ఎప్పుడూ దొర్సాని మెడలో ఉండేది. ఎత్తైన గుండెల మీద అది దొర్లుతూంటే తనలో ఏదో ఆనందం, దాన్ని కొంతసేపన్నా మెడలో వేసుకోవాలనే ఆశ... ఆవేశం.

ఆ రోజు... తల్లి... దొర్సానికి తలదువ్వుతోంది. వెంట్రుకల చిక్కులుదీసి కొబ్బరినూనె పట్టిస్తోంది. తన మనసంతా చంద్రహారం మీదుంది.

"అమ్మా ! గా హారం నేనొకసారి ఏసుకుంటనే !" తల్లిని అడిగింది మెల్లిగా.

"ఏందీ ! గా హారమా! " తల్లి గుండెలు బాదుకుంది. భయాందోళనలతో కళ్ళు విశాలమై పోయినై. బుగ్గలు నొక్కుకుంది.

"ఆఁ ... నాక్కావాలె పో"

"తప్పు బిడ్డా... అట్ల అడుగొద్దు."

"ఏందే !" దొర్సాని మొహంలో రంగులు మారిపోయినై. కొరకొర చూసింది. "చండాలపు పోరికి చంద్రహారం కావాల్నా ?"

"ఆఁ ... గదే ... ఒక్కసారి కావాలె దొర్సానీ !"

"అబ్బో ! అది మనం ముట్టుకోవద్దు బిడ్డా. నువ్వు జామచెట్టు కింద ఆడుకోపో" తల్లి బూదవ్వ బుజ్జగించింది.

పసిప్రాయం. పట్టుదల సడలలేదు.

"నేను పోనుపో. నాకు జామకాయలొద్దు." కాళ్ళు నేలకు కొట్టుకుంది "గా హారమే కావాలె. ఒక్కసారి ... ఆ ఆఁ..." పొరదండాలు దీసింది.

"నీయవ్వ !" దొర్సాని శివమెత్తింది. "మాలోల్లపోరీ ! నీ దరిద్రం కండ్లు నా నగమీద పడ్డయా !" కండ్లు నిప్పు రవ్వలైపోయినై. లేచొచ్చి ఛడామడా లెంపలు

వాయించింది. "ఈసారి గట్టడిగితే సురుకులు పెట్త లంబ్డీ ... లెవ్" మూలకున్న దుడ్డుకర్ర అందుకుంది.

"మాలోల్ల పోరికి బంగారం మాలనటా..."

"అయ్యో దొర్సానీ ... కొట్టొద్దు దొర్సానీ ! కాల్మొక్త ... నీ బాంచెన్... గా పోరికేందెల్సు ? ఇడిచి పెట్టు దొర్సానీ ..." తిల్ల లబలబలాడుతూ దొర్సాని కాళ్ళను చుట్టేసింది. ఇంకా దువ్వని వెంట్రుకలు మొహమ్మీది కొచ్చి దొర్సాని రాక్షసిలా కనబడింది. పసి మనసులోని ఆశ, ఆరాటం, ఆవేశం చప్పున చల్లారిపోయినై. వాటి స్థానాన్ని బాధ, ఏడుపు, నిస్సహాయత ఆక్రమించినై. వీపు మంట, చెంపలమంట ... గట్టిగా ఏడిస్తే మరింత గట్టిగా కొడ్తుందేమో. మనసున్నా... మాలలకు ఏడ్చే స్వేచ్ఛ లేదని అప్పుడు తెలిసింది. కందిపోయిన చెంపల్ని పుణుక్కుంటూ బయటికొచ్చింది. జామచెట్టును కౌగిలించుకుని జాముసేపు వెక్కి వెక్కి ఏడ్చింది.

చండాలం మాలది చేదిన నీళ్ళెట్టా తాగుతున్నరు ? చండాలం మాలవాడు పండించిన పంటలెట్టా తింటున్నరు ? అడిగే ధైర్యంగానీ, స్పృహగానీ లేవప్పుడు వర్ణాశ్రమ ధర్మాలకు వక్రభాష్యం చెబుతున్నారని అర్థం కాలేదు. నాన్నకోసం వెతికితే గడీలో కనబడలేదు. గడీగోడలు తనను చూసి నవ్వినట్టనిపించింది.

శుక్రవారం నాడు నగలన్నీ తీసి నలుగు పిండి రుద్దుకుని తలస్నాం చేసింది దొర్సాని. తర్వాత నగలు పెట్టుకుంటుంటే అందులో చంద్రహారం కనబడలేదట. అంతే ...

"ఏయ్ బవీ.. ఓ భవీ పోరీ !" గట్టిగా పిలిచింది. తాను జడుసుకుని ముందుకెళ్ళి నుంచుంది.

"ఆ చంద్రహారమెక్కడ దాచుకున్నవే లేకిడిదానా ?" గుడ్లు దెరిచి గద్దించింది. తన కంతా అయోమయం, బిత్తర చూపులు. దొర్సాని పెదాలు ముందరి పళ్ళ మధ్య బిగుసుకున్నై. కనుగవ్వలు ముందుకొచ్చినై. పళ్ళు పటపటలాడినై.

"చెప్పవేమే దొంగపోరీ !" పిడిగుద్దులతో తన వీపు విమానం మోత మోగింది.

"నేందియ్యలేదు దొర్సానీ... నాకు దెల్వదు దొర్సానీ !..." ఎంత మొత్తుకున్నా వినలేదు. "అమ్మతోడు దొర్సానీ... అయ్య తోడు దొర్సానీ.."

"నీయవ్వ... బద్మాష్ ముండా ! పాపమని తల్లి ముగ్గుర్ని ఇంట్ల ఉంచుకుని సాదుతుంటే బలిసిపోయింద్రు. చెప్పు ... ఎక్కడ దాచుకున్నవ్ ?" మహంకాళై పోయింది. జడబట్టి లాగి దబాదబా వాయించింది.

"వామ్మో... వాయ్యో!" తన ఏడుపుతో గడీ మార్మోగింది. పని వాళ్ళంతా వచ్చి చూస్తున్నారు. తల్లి వంటింట్లోంచి పరుగెత్తుకొచ్చి దొర్సాని కాళ్లందుకుంది.

"చిన్నపోరి... గంత పెద్ద నగ ఏంజేసుకుంటది దొర్సానీ ?" పరిపరి విధాల బతిమాలింది. దొర్సాని కళ్ళల్లో క్రౌర్యం నిండుకుంది.

'ఓర్నీ... బద్మాష్ బూదీ ! ఐతే... ఆ నగ నువ్వే తీసిన వన్నమాట. చెప్పు... ఎక్కడ దాచుకున్నవ్ ?... తల్లి వీపు పచ్చడైపోయింది. అంతా తమాషా చూసేవాళ్ళే గాని ఇదేమిటని అడిగే ధైర్యం పనివాళ్ళ కెక్కడిది ?

"అయ్యో దొర్సానీ ! దాన్నెందుకట్లా కొట్టుడు ?" నాన్న వచ్చేశాడు. నాన్న వెనక దొర వస్తున్నాడు. సంగతి అంతా దొర్సాని ద్వారా విని దొర వీరభద్రుడై పోయిండు.

"నీ పెండ్లాం పిల్లలు నా ఇంట్లనే.. నా దగ్గరే ఉండి మా నగ దొంగతనం జేస్తార్రా బాడ్కావ్!" కర్ర అందుకుని నాన్న మీద విరుచుకు పడ్డాడు. దొర నాన్నను, దొర్సాని అమ్మను అలసిపోయేదాకా కొట్టారు. అల్లాడుతున్న ముగ్గురుకి పశువుల కొట్టం శరణ్యమైంది. గూడు లేని పక్షులవలె ముగ్గురు మూడు దిక్కుల కూచుండి మనసారా ఏడ్చారు. ఆ తర్వాత మరో పనిమనిషి వచ్చి "బూదవ్వా ! నగ దొరికిందట. పెద్ద దొర్సాని (దొరతల్లి) గుడికి పోయెటప్పుడేస్కపోయిందట." తల వంచుకుని అలా చెప్పి ఇలా వెళ్ళిపోయింది.

రాత్రయింది. ఖాళీ కడుపుల నిండా దుఃఖం నిండుకుంది. తినమని ఎవ్వరూ అడగలేదు. అమ్మ తన చెయ్యందుకుని నాన్న దగ్గరికొచ్చి కూచుంది.

"ఏమయ్యా... మనం మాలోల్లమైతే మనుషులం కామా ? చండాలమటా... అంటే ఏందో.. మనకంటే గీ పవువులేనయం," నాన్న ఒడిలో తలదాచుకుని బావురుమంది.

"ఇదంతా మన చాతగానితనం బూదీ ?" నాన్న తనను దగ్గరకు తీసుకుని ఫక్కున పగిలాడు.

'ఇంగ మనం ఇక్కడ బతకలేము. ఇదే రెక్కల కష్టం ఇంకెక్కడ జేసుకున్నా బతుకలేమా!' సూటిగా అడిగింది అమ్మ.

"అవునే.." నాన్నలో ఏదో ధైర్యం. "ఎక్కడున్నా బతుకుతాం. ఈ నరకం కంటే ఉపాసముండి చచ్చిందినయం."

"ఉపాస మెందుకుంటం ! ఉపాయమున్నోళ్ళు ఉపాసముంటరా?" అమ్మా నాన్నల కళ్ళు ధారాపాతాలైపోయినై. ముగ్గురూ కౌగలించుకుని ఎంతసేపు ఏడ్చారో...

"ఇంకా ఇక్కణ్నే ఉంటే మన పోరి బతుకు అన్యాయమై పోతది." నాన్న నెత్తి రుమాలుతో అమ్మ కళ్ళు తుడిచాడు. తనను ఒళ్లోకి తీసుకున్నాడు. అమ్మా, నాన్న, తాను ఆ రోజు అనుభవించిన బాధ అంతా ఇంతా గాదు. అది ఈ జీవిత కాలంలో మరిచి పోలేనిది. తెల్లారే సరికల్లా ఊరు దాటారు. బస్సెక్కి పట్నం చేరుకున్నారు.

ఓ రోజంతా తిరగింది అమ్మ. ఒకరింట్లో పనికి కుదిరింది. లేబర్ కాలనీలో గుడిసె అద్దెకు దొరికింది. నాలుగైదు రోజుల్లో నాన్నకు ఫ్యాక్టరీలో పని దొరికింది. తనను బడిలో చేర్పించారు. పట్టుదల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తాను శ్రద్ధగా చదువుకుని డాక్టరైంది. భర్త ఆఫీసరు ...

గోడ గడియారం నాల్గుసార్లు టంగుమన్నది.

ఆపరేషన్లయ్యాక ఈ రోజే వెళ్ళి చంద్రహారం కొనుక్కోవాలి. అలాంటి డిజైనే వెతకాలి.. ధృడ నిర్ణయం ఉత్సాహాన్నిచ్చింది.

సులోచన కళ్ళకు ఆపరేషనైపోయింది. కుట్లు విప్పగానే కలియుగం స్పష్టంగా కనబడింది. ప్రపంచాన్ని గెలిచినంత సంతోషమైంది.

"హబ్బా ! ఈ లోకాన్ని మళ్ళీ చూస్తాననుకోలేదు. గుడ్డి మనిషికి లోకమంతా కటే గదా !" అంది కుట్లు విప్పిన అసిస్టెంటు డాక్టర్తో.

"మరి ... మా డాక్టర్ భవాని గారంటే ఏమనుకున్నారు ? ఆమె దృష్టి దాత గదా !" డిస్చార్జి సమయం.

క్షేమంగా వచ్చాను. లాభంగా వెల్తున్నాను. వెళ్ళేముందు దృష్టి దాతనో సారి చూడాలి... సులోచన కొడుకు కోడలుతో కలిసి డాక్టర్ గదిలో కెళ్ళింది.

"నమస్తే డాక్టర్ !" కృతజ్ఞతగా చేతులు జోడించింది.

డాక్టర్ భవాని మెడలో మూడు వరుసల చంద్రహారం మెరిసిపోతోంది. సులోచన మెడ బోసిగా ఉంది.

"నమస్తే !" డాక్టర్ మందహాసం. "ఇప్పుడు బాగా కన్పిస్తుందా ?"

"అవును డాక్టరమ్మా !" సులోచన గొంతు ఆర్ద్రమైంది. "మీరెంతో మేలు చేసింద్రు. పల్లెటూర్ల మా ఆస్తులన్నీ పరాయోల్లపాలై పోయినై. బతుకు నవ్వుల పాలైంది. పల్లెటూర్ల ఉండలేక పట్నమొచ్చినం. గప్పుడు కండ్లు పోయినై. ఇంగ నేనెందుకు బతకాలనుకున్నాను. కాని మళ్ళీ చూపు తెప్పించి ఎంతో మేలు చేసినవు. నాకో దేవతలా కన్పిస్తున్నావమ్మా." కొంగుతో కళ్ళద్దుకుని డాక్టర్ను తేరిపార చూసింది.

డాక్టర్ మెడలో చంద్రహారం. అది తన నగలాగే ఉంది. బిళ్ల గూడా అలాగే ఉంది.

"మా అమ్మ మెడలున్న చంద్రహారం అమ్మేసి ఆపరేషన్ చేయించిన డాక్టర్!" కొడుకు గొంతులో గాంభీర్యంతో పాటు ఆవేదన తొంగిచూసింది.

"ఆ నగకంటే మా అత్తయ్య ఆరోగ్యమే మాకు మహాభాగ్యం డాక్టర్." కోడలు ధైర్యం.

అందరి దృష్టి చంద్రహారం మీదే కేంద్రీకృతమైంది.

"అవునవును. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. గదా !" చంద్రహారం తడిమి చూసుకుంది డాక్టర్. "నేనైతే చిన్నప్పట్నుంచి ఇలాంటి నగ కావాలని ఎంతో ఆరాటపడ్డాను. మా అమ్మ బూదవ్వ, నాన్న యాదయ్యలు దీని కోసం చావు దెబ్బలు తిన్నారు. అన్యాయాన్ని భరించారు. ఊరు వదిలి వచ్చేశాం. మీ మెడలో చంద్రహారం కనబడగానే మళ్ళీ నాకా కోరిక కల్గింది. మొన్ననే కొనేశాను." ఎడమ చేత్తో చంద్రహారం రాళ్ళ బిళ్ళను తడిమి కుడిచేత్తో కలమందుకుంది.

సులోచన బుర్రలో తుఫాను చెలరేగింది.

'నువ్వు... మా బూదవ్వ... ఆ భవి... భవానీవా !'. ఆశ్చర్యం, ఆనందాలు పొంగుకొస్తున్నై. ముందు ఉద్వేగం ఆ తర్వాత ఉల్లాసం.. అంతా కలిసి పశ్చాత్తాపం.

"భగవంతుడా ! నీ లీలలు అనంతం. బతుకు బాటల ఓడలు బండ్లు, బండ్లు ఓడలై పోతుంటాయి. కులంలో ఏముంది ? మనిషి గుణమే ముఖ్యం...! చంద్రహారం మీంచి దృష్టి మరల్చడం కష్టంగా ఉంది. డాక్టర్ భవానీకి మరోసారి నమస్కరించి బయటికొచ్చింది.

డాక్టర్ భవాని చంద్రహారం చేతుల్లోకి తీసుకుంది. రంగుల రాళ్ళ బిళ్ళను తిరగేసి పరీక్షగా చూసింది. దాని మీద చెక్కిన అక్షరాలు మలిపేశారు. కాని బాగా పరీక్షించి చేస్తే "సులోచన!" అని చూచాయగా కనబడుతోంది.

❋ ❋ ❋ ❋

సుప్రభాతం
దీపావళి ప్రత్యేక సంచిక
28 అక్టోబర్, 2000